www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 6 ఫిబ్రవరి 2024 5

ఏలూరు

## న్యాయవాదుల వంటావార్పు

**ప్రజాశక్తి - నూజివీడు రూరల్**

ఏపి ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేయాలని కోరుతూ పట్టణంలోని కోర్టు భవనాల వద్ద బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు సోమవారం వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాది వాకా రాజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజల ఆస్తులకు రక్షణ లేని ఏపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు జనపరావు, పద్మాంజలి, నరసింహారావు, రాఘవరావు, డిక్సన్, రామారావు పాల్గొన్నారు.

# పోలవరం, చింతలపూడి పూర్తి చేస్తాం..

- పామాయిల్, ఆక్వా రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తాం
- మామిడి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తాం
- జిల్లాలో వైసిపి ఎంఎల్‌ఎల అవినీతిపై తీవ్ర విమర్శలు
- 64 రోజులు కష్టపడితే టిడిపి, జనసేన ప్రభుత్వమే
- చింతలపూడి 'రా.. కదలిరా' సభలో టిడిపి అధినేత చంద్రబాబు
- హెలీప్యాడ్ వద్ద బజర్ సౌండ్‌తో కొద్దిసేపు కలకలం
- భారీగా జన సమీకరణతో టిడిపి నేతల్లో ఉత్సాహం

**ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, చింతలపూడి**

టిడిపి అధికారంలోకొచ్చాక పోలవరం, చింతలపూడి ఎత్తిపోతల పథకం సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని టిడిపి జాతీయ అధ్యక్షుడు, మాజీ సిఎం చంద్రబాబునాయుడు తెలిపారు. శనివారం చింతలపూడిలోని ఆంథోని నగర్‌లో 'రా.. కదలిరా' సభ నిర్వహించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా నిర్దేశిత సమయం 3.30 గంటలకు చంద్రబాబు హెలీకాప్టర్‌లో హెలీప్యాడ్‌కు చేరుకున్నారు. ఆయనకు టిడిపి నాయకులు ఘనస్వాగతం పలికారు. నాలుగు గంటలకు సభా వేదికపైకి చంద్రబాబు చేరుకోగానే టిడిపి, జనసేన నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించారు. చంద్రబాబు రాకముందు చింతలపూడి టిక్కెట్ ఆశిస్తున్న సొంగా రోషన్‌కుమార్, బొమ్మాజీ అనిల్, ఆకుమర్తి రామారావుతోపాటు ఏలూరు ఇన్‌ఛార్జి బడేటి చంటి, మాజీ మంత్రి ప్రతిపాటి పుల్లారావు, జనసేన నాయకులు కొటికలపూడి గోవిందరావు, రెడ్డి అప్పలనాయుడు, మేకా ఈశ్వరయ్య, ఇతర నాయకులు ప్రసంగించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ గతంలో చింతలపూడిలో అనేక సభలు నిర్వహించినప్పటికీ ఇప్పుడు చింతలపూడి జనప్రభంజనంగా మారిందన్నారు. 64 రోజులు కష్టపడితే రాష్ట్రానికి మంచి రోజులు వస్తాయన్నారు. ఆడబిడ్డలు, తోబుట్టువులు అండగా ఉంటే ఎవరినైనా జయిస్తానన్నారు. ఈ గెలుపు నా కోసం కాదని, చితికిపోయిన రాష్ట్రం కోసమన్నారు. జగన్ పాలనలో ప్రజలెవ్వరూ ఆనందంగా లేరన్నారు. రూ.12 లక్షల కోట్లు అప్పుచేసి వ్యవస్థలను భ్రష్టు పట్టించాడన్నారు. నాసిరకం మద్యంతో ఎంతోమంది చనిపోయారన్నారు. పెట్రోల్, డీజిల్, నిత్యావసరాల ధరలు టిడిపి హయాంలో ఎంతున్నాయి, ఇప్పుడు ఎంత పెరిగాయనేది వివరించారు. ఉచితంగా ఇచ్చే ఇసుకను ట్రాక్టర్ రూ.ఐదు వేలు చేశారన్నారు.



సభకు హాజరైన జనం

### ప్రాజెక్టులు పూర్తి చేస్తాం

పోలవరం రాష్ట్రానికి వరం అని, 72 శాతం పూర్తి చేశామన్నారు. పట్టిసీమ ఏడాదిలో పూర్తిచేసి 124 టిఎంసిల నీటిని కృష్ణాకు తరలించామని తెలిపారు. పోలవరం డయాఫ్రం వాల్, కాపర్ డ్యామ్, గైడ్‌బండ్ ఏమైందో తెలియదని, ఎప్పటికి పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొందని అన్నారు. చింతలపూడి పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరందిస్తామన్నారు. రైతులు వాణిజ్య పంటలు వేసుకోవచ్చునన్నారు. పామాయిల్‌కు సబ్సిడీలు ఇచ్చేవారమని, ఇప్పుడు అవి లేకుండా పోయాయన్నారు. టన్ను ధర రూ.18 వేల నుంచి రూ.12 వేలకు పడిపోయిందన్నారు. ఆక్వాకు రూ.1.50కే యూనిట్ విద్యుత్ అందిస్తామన్నారు. సూపర్ సిక్స్ కార్యక్రమాలు అమలు చేయనున్నట్లు తెలిపారు. మొదటి తేదీనే పెన్షన్ ఇంటిదగ్గర ఇస్తామని, మూడు నెలలు తీసుకోకపోయినా ఒకేసారి ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. జగన్‌ను చిత్తుచిత్తుగా ఓడించాలన్నారు.

### వైసిపి ఎంఎల్‌ఎలపై తీవ్ర విమర్శలు

ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ తెలివైన వాడని, ఎన్నికల నుంచి తప్పించుకున్నారని, ఐదేళ్లలో చేసిందేమీ లేదని అన్నారు. మంత్రి కొడుకుని ఇక్కడకు తీసుకొచ్చారని, రైతుకు గోనెసంచులు ఇవ్వలేని వాడు, పార్లమెంట్‌కు పోటీకి తన కొడుకును దింపుతారా అంటూ ఎద్దేవా చేశారు. చింతలపూడి ఎలిజాకు గ్రాఫ్ లేదని చీటీ చిరిగిపోయిందన్నారు. నా గ్రాఫ్ కాదు..మీ గ్రాఫ్ పడిపోయిందని జగన్‌ను ఆయన అన్నారన్నారు. మిథున్‌రెడ్డి పెద్దిరెడ్డి కొడుకని, ఇక్కడ అతని పెత్తనం ఏమిటన్నారు. ఎలిజా మాట్లాడినట్లు సామాజిక న్యాయం లేదని, ఎస్‌సిలపై చిన్నచూపు ఉందన్నారు. వాసుబాబు వసూళ్లరాజు అంటూ విమర్శించారు. చేపల చెరువులు, పోలవరం కుడికాలువ మట్టిని సైతం తినేశాడన్నారు. కాలువ గట్లు కొట్టుకుపోయే పరిస్థితి వచ్చిందన్నారు. దెందులూరు ఎంఎల్‌ఎ అబ్బాయిచౌదరి అక్రమార్కులకే అక్రమార్కుడన్నారు. రౌడీషీటర్లతో ములాఖత్ అయి ముందుండి కొట్లాడిస్తున్నారు. చింతమనేనిపై పెట్టిన కేసు లేదన్నారు. తెల్లం బాలరాజు గిరిజనుల డబ్బు కొట్టేశాడన్నారు. ఎవరు తిరిగిన వారిపై అక్రమకేసులు పెట్టించారన్నారు. వీళ్ళ గిరిజనులను రక్షిస్తారా అన్నారు. మేకా అప్పారావు కొడుకు నూజివీడును గుండుకొట్టించాడని తెలిపారు. ఆళ్ల నాని ఏం చేశాడో ఆయనకే తెలిదన్నారు. దూలం నాగేశ్వరరావు కొడుకు చేపల చెరువుల్లో, సెంటు పట్టా భూముల్లో రూ.300 కోట్లు దోచుకున్నారన్నారు. చింతలపూడి, పోలవరం పూర్తి చేయడంతోపాటు, మామిడి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, మాజీ మంత్రులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. సభ పూర్తయిన ట్రాఫిక్ నిలిపివోవడంతో సభకు వచ్చినవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

### హెలిప్యాడ్ వద్ద బాంబు కలకలం

చంద్రబాబు దిగుతోపే హెలిప్యాడ్ వద్ద బాంబు స్క్వాడ్ తనిఖీల్లో బజర్ మోగడంతో కొద్దిసేపు కలకలం నెలకొంది. వెంటనే ఆ ప్రాంతంలో తవ్వగా ఇనుప ముక్క బయటపడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇతర వస్తువులు ఏమీ లేవని బాంబ్ స్క్వాడ్ సిబ్బంది నిర్ధారణకు వచ్చారు.

ధర్నాలో నినదిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, నేతలు

### సమస్యలు పరిష్కరించాలని..

## మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో డిఇఒ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కనీస వేతనం ఇవ్వాలని, బడ్జెట్ పెంచాలని, స్కూళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని నినదించారు. అనంతరం అసిస్టెంట్ డైరెక్టర్ అవధానికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నానుద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.నాగమణి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి రాకముందు పాదయాత్ర సందర్భంగా తాము అధికారంలోకొస్తే రూ.వేలు వేతనం ఇస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకంగా ఉన్న మధ్యాహ్న భోజనానికి నిధులు కేటాయించడంలో, పని చేస్తున్న కార్మికుల పట్ల కేంద్ర ప్రభుత్వం అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. జగనన్న గోరుముద్ద పేరుతో అద్భుతమైన మెనూ ప్రకటించారని, దానికనుగుణంగా డబ్బులు ఇవ్వడం లేదని, ఫలితంగా మధ్యాహ్న భోజన కార్మికులు అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నెలా ఐదో తేదీలోపు వేతనాలు, బిల్లులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్వచ్ఛంద సంస్థలను తొలగించి, కార్మికులతో పథకాన్ని నిర్వహించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళన చేస్తామని అన్నారు. ఈ ధర్నాలో సిఐటియు నాయకులు కొండలరావు, వై.చంద్రకళ, లక్ష్మి, అశోక్, అనసూయ, వెంకటలక్ష్మి, మహాలక్ష్మి, ఆశా తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్, జిల్లా అధికారులు

## 9న నులిపురుగు నిర్మూలన మాత్రల పంపిణీ

### కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

**ప్రజాశక్తి - ఏలూరు**

ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవడం ద్వారా పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం లేకుండా చూడొచ్చని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. ఈ నెల 9న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మాత్రల పంపిణీకి అధికారులు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో స్పందన కార్యక్రమానికి ముందు కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ ఎన్‌డిడి కార్యక్రమ పోస్టర్లను జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, జిల్లా అధికారులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1-19 ఏళ్ల వయస్సు వారందరూ తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఫిబ్రవరి 9న ఏకారణం చేతనైనా మాత్రలు తీసుకోకుండా మిగిలిన వారికి, ఫిబ్రవరి 16న మాత్రలు వేయించాలని ఆదేశించారు. పిల్లల్లో అధికశాతం అనారోగ్య సమస్యలు రక్తహీనత వల్లే ఎదురవుతాయని, ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకుని 19 సంవత్సరాల్లోపు వయస్సువారు తప్పనిసరిగా మాత్రలు వేసుకునేలా అవగాహనా కార్యక్రమాలను చేపట్టాలన్నారు. జిల్లాలో నాలుగు లక్షల 533 మంది పిల్లలను గుర్తించారని, వీరికి మాత్రలు పంపిణీ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో డిఎంహెచ్‌ఒ డాక్టర్ శర్మిష్ఠ మాట్లాడుతూ 1-19 సంవత్సరాల్లోపు పిల్లలకు ప్రతి సంవత్సరం రెండుసార్లు ఆల్బేండజోల్ మాత్రలు పంపిణీ చేస్తారని తెలిపారు. 1-2 ఏళ్ల పిల్లలకు 200 ఎంజి మాత్ర, ఆపై 19 ఏళ్ల వయస్సు వరకు 400 ఎంజి మాత్ర ఇవ్వాల్సి ఉంటుందని వివరించారు. భోజనం చేసిన తర్వాత ఈ మాత్రలను వేయాల్సి ఉంటుందని చెప్పారు. జ్వరం, ఇతర అనారోగ్యంతో ఉంటే ఈ మాత్రలను వేయకూడదని వెల్లడించారు. దీనిపై టీచర్లు, ఆశావర్కర్లు, ఎఎన్‌ఎంలు, అంగన్వాడీ, పారామెడికల్ సిబ్బంది తదితరులకు అవగాహన కల్పించామని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ డి.పుష్పమణి, జెడ్‌పి సిఇఒ కెఎస్ఎస్.సుబ్బారావు, డిఇఒ శ్యామ్‌సుందర్, డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ ఆర్.విజయరాజు, ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలీ, ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ భానుశ్రీ, హెల్త్ జిల్లా కోఆర్డినేటర్ డి.పాల్‌సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

### ఎర్రకాలువ భూముల్లో..

## అక్రమ విద్యుత్ కనెక్షన్లు తొలగించాలి

### సిపిఎం వినతి

**ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం**

ఎర్రకాల్వ ప్రాజెక్టు ఇరిగేషన్ భూముల్లో అక్రమ విద్యుత్ కనెక్షన్లను తక్షణం తొలగించాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ నేతలు స్పందన కార్యక్రమంలో ఆర్‌డిఒ అద్దయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల మండల కార్యదర్శి ఎం.జీవరత్నం మాట్లాడుతూ తాడువాయి, చిన్నవారిగూడెం, ఎ.పోలవరం గ్రామాల్లో అక్రమ విద్యుత్ కనెక్షన్లతో సాగు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గత నెల 29న ఫిర్యాదు చేశామన్నారు. అయినా చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తూ అక్రమ విద్యుత్‌తో సాగు చేసే వారితో కుమ్మక్కై, తాడువాయి విద్యుత్ శాఖ ఎఇ, పోలవరం లైన్‌మెన్ కనెక్షన్లు కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పలుమార్లు ఆర్‌డిఒ, విద్యుత్ శాఖాధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లినా తొలగించమని అడిగితే ఎఇ, లైన్‌మెన్ ఫిర్యాదు చేసిన యాగంటి సీతపై దురుసుగా ప్రవర్తిస్తూ తాము కనెక్షన్లు తొలగించబోమని, మీకు చేతనైందని చేసుకోమని బెదిరించడం దుర్మార్గమన్నారు. విద్యుత్ అధికారుల వైఖరిని తీవ్రంగా ఖండించారు. తక్షణమే విద్యుత్ శాఖ డిఇ జోక్యం చేసుకుని ఎఇ, లైన్‌మెన్‌పై చర్యలు తీసుకోవాలని, అక్రమ కనెక్షన్లు తొలగించాలని డిమాండ్ చేశారు. దీనిపై తగు చర్యలు తీసుకుంటానని ఆర్‌డిఒ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు అందుగుల ప్రభాకర్‌రావు, యాగంటి సీత, జి.సూర్యకిరణ్, నేతలు వి.నరసింహారావు, కె.సుబ్బారావు, బి.నాని, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నినదిస్తున్న నేతలు

## 'జగనన్నకు చెబుదాం'లో ట్రై సైకిల్ అందజేత

### జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

**ప్రజాశక్తి - ఏలూరు**

వికలాంగుడైన యడవల్లి ఏడుకొండలకు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమంలో సోమవారం ట్రై సైకిల్ అందజేశారు. ఉంగుటూరు మండలం కొక్కరమూడి గ్రామానికి చెందిన ఏడుకొండలు ట్రై సైకిల్ లేక చాలా ఇబ్బందులు పడుతున్నానని, దయచేసి ట్రై సైకిల్ ఇప్పించాలని అర్జీ అందజేయగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ వెంటనే స్పందించి జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ అధికారిణి పి.రాకాడ మహిని ఆదేశించగా వెంటనే ఆమె ట్రై సైకిల్‌ను స్పందన కార్యక్రమానికి తెప్పించారు. దీంతో జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి ఏడుకొండలుకు అందజేశారు. ఈ సందర్భంగా ఏడుకొండలు మాట్లాడుతూ ఎన్నోఏళ్లుగా ట్రై సైకిల్ లేక ప్రయాణించడానికి ఎన్నో వ్యయప్రయాసలకు గురైనానన్నారు. జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం ద్వారా ట్రై సైకిల్ అందించడం పట్ల కలెక్టర్‌కు, ప్రభుత్వానికి అతను కృతజ్ఞతలు తెలుపుతూ సంతోషాన్ని వ్యక్తం చేశాడు.

ట్రై సైకిల్ అందజేస్తున్న కలెక్టర్, జెసి

## విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

### యూనియన్ ఆధ్వర్యాన 'స్పందన'లో కలెక్టర్‌కు వినతి

**ప్రజాశక్తి - ఏలూరు**

విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, డైరెక్ట్ పేమెంట్ విధానం అమలు చేయాలని కోరుతూ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం స్పందన కార్యక్రమంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు వినతిని అందజేశారు. ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ పిలుపులో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు జె.శ్రీనివాసరావు, డిఎన్‌విడి ప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన వాగ్దానం ప్రకారం విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరినీ తక్షణమే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఎనర్జీ అసిస్టెంట్లను తక్షణమే సంస్థలో విలీనం చేయాలన్నారు. ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో విధి నిర్వహణలో అత్యధిక మంది ప్రాణాల కోల్పోయేది విద్యుత్ సంస్థల్లో మాత్రమేనని, ఇన్ని త్యాగాలు చేస్తున్న విద్యుత్ కార్మికుల పట్ల ముఖ్యమంత్రి చిన్నచూపు చూడడం అన్యాయమన్నారు. విద్యుత్ మీటర్ రీడర్లు స్టోర్స్ హమాలీలకు కనీస వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇపిడిసిఎల్ సూపరిండెంట్ ఇంజనీర్ ఇంజనీర్లకు వినతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సత్తిబాబు, సుబ్రహ్మణ్యం, వి.సాయిబాబు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతినిస్తున్న నాయకులు

## రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన

**ప్రజాశక్తి - ఏలూరు**

వాహనాలు నడిపేటప్పుడు రోడ్డు సైన్లు, ట్రాఫిక్ లైట్లను అనుసరించడంతో పాటు ఒకే లైనును అనుసరించాలని మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ కెవిఎస్.ప్రసాద్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అవసరమైనప్పుడు ఇండికేటర్ని ఉపయోగించడం, ఎల్, 'బేబీ ఆన్ బోర్డ్' వంటి సైన్ల వల్ల మరింత జాగ్రత్తగా డ్రైవింగ్ చేయడానికి దోహదపడతాయన్నారు. అదేవిధంగా జీబ్రా క్రాసింగ్‌ల వద్ద మాత్రమే రోడ్డును దాటాలన్నారు. ప్రాణ రక్షణ కోసం ప్రతిఒక్కరూ హెల్మెట్, సీటుబెల్ట్ ఉపయోగించడం ఎంతైనా అవసరమన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపవద్దని విద్యార్థులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంవిఐలు కెవిఎస్.ప్రసాద్, జి.ప్రసాద రావు, కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రసాద్

## ఓటిపిలు ఇవ్వకండి

### స్పందన కార్యక్రమంలో అదనపు ఎస్‌పి స్వరూప రాణి

**ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్**

సైబర్ నేరగాళ్లు మరింత నూతన వరవడిలో మోసాలకు పాల్పడుతూ ప్రస్తుతం ఎన్నికల సమయం కావడంతో ఓటర్ల నమోదు కార్యక్రమం అని చెప్పి ఓటిపిలు సేకరించి బ్యాంకు ఖాతాల నుంచి నగదును కొల్లగొడుతున్నారని, అటువంటి వారి మాటలకు మోసపోవద్దని జిల్లా అదనపు ఎస్‌పి స్వరూప రాణి సూచించారు. ఏలూరు నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రతి సోమవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదునపు ఎస్‌పి స్వరూప రాణి పాల్గొని ఫిర్యాదుదారుల వద్ద నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సివిల్ సంబంధిత వ్యాజ్యాలను పోలీసులు పరిష్కరించాలని, వాటిని ఆయా కోర్టుల్లో పరిష్కరించుకోవాలని సూచించారు. అలాగే సైబర్ నేరగాళ్లు మరింత వరవడితో సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. స్పందన కార్యక్రమానికి దాదాపు 50 మంది ఫిర్యాదుదారులు వచ్చారని ఫిర్యాదుదారులందరికీ సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఉచిత భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేశామని కూడా ఆమె తెలియజేశారు. సంబంధిత ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులకు తెలిపారు.

ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎఎస్‌పి

## 3.25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

### జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి

**ప్రజాశక్తి - ఏలూరు**

జిల్లాలో ఇంతవరకు 254 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 41,442 మంది రైతుల నుంచి రూ.710.05 కోట్ల విలువైన 3,25,043 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు సేకరించడమైందని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. ప్రస్తుతం రూ.657.85 కోట్లు రైతుల వ్యక్తిగత ఖాతాకు జమ జేయడం జరిగిందన్నారు. మరో రూ.52.20 కోట్లు బ్యాంక్ వద్ద జమ చేసే ప్రక్రియలో ఉందన్నారు. జిల్లాలో 2023-24 ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలుకు నిర్ధారించబడిన లక్ష్యంలో 97 శాతం ధాన్యం రైతుల నుంచి సేకరించడం జరిగిందని, సేకరించిన ధాన్యాన్ని జిల్లాలోని ఆన్‌లైన్‌లో మ్యాప్ చేయబడిన వివిధ రైస్ మిల్లులకు రవాణా చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం వారు నిర్దేశించిన లక్ష్యానికి దాదాపు చేరుకొన్నందున 2023-24 ఖరీఫ్ పంట కాలానికి సంబంధిచి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఈనెల 15వ తేదీకి నిలుపుదల చేస్తున్నట్టు తెలిపారు.

# భీమడోలు ఎంపిడిఒగా స్వర్ణలత

ప్రజాశక్తి - భీమడోలు

మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా టి.స్వర్ణలత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా పనిచేసిన అన్నపూర్ణ బాధ్యతలను ఆమెకు అప్పగించారు. ఎన్నికల నేపథ్యంలో భీమడోలు ఎంపిడిఒగా పనిచేసిన వాగంటి పద్మావతి దేవి కృష్ణా జిల్లా ముసునూరుకు బదిలీ అయ్యారు. వీరి స్థానంలో కృష్ణా జిల్లా పామర్రు ఎంపిడిఒగా పనిచేస్తున్న టి.స్వర్ణలత భీమడోలు బదిలీపై వచ్చారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన స్వర్ణలతను కార్యాలయ అధికారులు, సిబ్బందితోపాటు పలువురు ప్రజాప్రతినిధులు అభినందించారు.

# ఎంపిడిఒ మల్లీశ్వరికి సన్మానం

ప్రజాశక్తి - ముదినేపల్లి

సన్మానిస్తున్న అధికారులు

ముదినేపల్లి మండల ఎంపిడిఒగా పనిచేసి ఎన్నికల ప్రక్రియలో భాగంగా బదిలీపై పల్నాడు జిల్లా పెదకూరపాడు వెళ్లిన మల్లీశ్వరికి ఘనంగా సన్మానం జరిగింది. సోమవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో తొలుత మల్లీశ్వరిని ఎంపిపి సత్యనారాయణ, జెడ్‌పిటిసి ఈడే వెంకటేశ్వరమ్మ దంపతులు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య దంపతులు, వైస్ ఎంపిపిలు రాధా, సునీత ఘనంగా సన్మానించారు. నూతన ఎంపిడిఒగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన మురళీ గంగాధరరావును కూడా సన్మానించి అభినందనలు తెలిపారు.

# మున్సిపల్ కమిషనర్‌గా వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు మున్సిపల్ కమిషనర్‌గా ఆర్.వెంకటరామిరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నంద్యాల జిల్లా డోన్ నుంచి నూజివీడుకు బదిలీ అయ్యారు. గతంలో నూజివీడు కమిషనర్‌గా పనిచేసిన అబ్దుల్ రషీద్ ప్రకాశం జిల్లా అద్దంకి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ కౌన్సిల్ సహకారంతో పట్టణాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

# మున్సిపాలిటీకి ఎలక్ట్రికల్ ఆటోలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు మున్సిపల్ కార్యాలయానికి సోమవారం కొత్తగా 6 ఎలక్ట్రికల్ బ్యాటరీ ఆటోలు వచ్చాయి. పర్యావరణ రహిత ఎలక్ట్రికల్ ఆటోలు స్వచ్ఛభారత్ మిషన్ నుంచి రావటం జరిగిందని సానిటరీ ఇన్స్‌పెక్టర్ నాగరాజు తెలిపారు. ఒక్కొక్క వాహనం రూ.4 లక్షల వరకు ఉంటుందని అంచనా వేశారు. పట్టణ పరిధిలోని 32వ వార్డులో పరిశుభ్రత కార్యక్రమానికి వీటిని వినియోగిస్తామని తెలిపారు.

# కాపు సంక్షేమసేన నూతన కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు

కాపు సంక్షేమసేన జిల్లా నూతన కార్యాలయాన్ని స్థానిక అశోక్ నగర్‌లో సోమవారం ప్రారంభించారు. రాష్ట్ర జిల్లా అధ్యక్షులు పులి శ్రీరాములు, ముఖ్య సలహాదారు మోటేపల్లి చంద్రశేఖర్, నగర అధ్యక్షులు వాసా రాజు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాపు సంక్షేమసేన నాయకులు కరెళ్ల భాస్కర రావు, వీరంరెడ్డి రమేష్, కొప్పిశెట్టి లేఖ గోపాల్, యడ్లపల్లి ప్రసాద్, బడే సతీష్ నాయుడు, కూనిశెట్టి మురళీకృష్ణ పాల్గొన్నారు.

# కార్మికుల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి - టి.నరసాపురం

కార్మికుల సంక్షేమం కోసం ఎఐటియుసి నిరంతరం పోరాటం చేస్తుందని ఎఐటియుసి చింతలపూడి ఏరియా గౌరవాధ్యక్షుడు టివిఎస్.రాజు అన్నారు. మండలంలోని మక్కినవారిగూడెం ఎఐటియుసి కార్యాలయంలో సోమవారం మిరా వర్కర్స్ యూనియన్ ఎన్నికల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన టివిఎస్ రాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల హామీలు అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యాయన్నారు. మోడీ మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారని విమర్శించారు. జగన్మోహన్‌రెడ్డి కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తానని ప్రగల్భాలు పలికారన్నారు. అనంతరం ఎఐటియుసి చింతలపూడి ఏరియా ఉపాధ్యక్షులు కొండమూరు శ్రీనివాసరావు అధ్యక్షతన మిరా వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మల్లెల సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా బైగాని ఏలంబరం, కార్యదర్శి కొప్పుల సతీష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

# అదనపు కట్నం కోసం వేధించిన వ్యక్తికి శిక్ష

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

అదనపు కట్నం కోసం భార్యను వేధించిన వ్యక్తికి జిల్లా న్యాయమూర్తి మూడు సంవత్సరాల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.10వేలు జరిమానాగా విధిస్తూ సోమవారం జిల్లా కోర్టులో తీర్పునిచ్చారు. సంబంధిత వివరాల ప్రకారం ఏలూరు నగరానికి చెందిన లావూరి ప్రమీల తాడేపల్లిగూడెం ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఈమెకు కేతావత్ కిషన్ నాయక్ అనే వ్యక్తితో వివాహమైంది. వివాహ సమయంలో కట్న కానుకలు తీసుకున్న తరువాత కూడా అదనపు కట్న కానుకల కోసం ప్రమీలను నాయక్ వేధించసాగాడు. చేసేదేమీ లేక ప్రమీల దిశ పోలీసులను 2020లో ఆశ్రయించింది. దీనిపై దిశ పోలీసులు 91/2020 క్రైమ్ నెంబర్‌గా కేసు నమోదు చేశారు. సోమవారం విచారించారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేవిధంగా చర్యలు చేపట్టిన ఎపిపి హేమలత, దిశ పోలీస్ స్టేషన్ ఎస్ఐ కె.నాగేశ్వరరావు, ప్రస్తుత దిశ పోలీస్ స్టేషన్ సిఐ విశ్వం, కోర్ట్ హెడ్ కానిస్టేబుల్ వెంకటరమణ, కానిస్టేబుల్ లక్ష్మీనారాయణలను ఎస్‌పి మేరీ ప్రశాంతి ప్రత్యేకంగా అభినందించారు.

# గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

## ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ

ప్రజాశక్తి - ముదినేపల్లి

గ్రామాల అభివృద్ధి కోసం అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ కోరారు. ముదినేపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో అసంపూర్తిగా మిగిలి ఉన్న సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీ పనులను సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు బాధ్యత తీసుకుని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జెడ్‌పిటిసి ఈడే వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ రూ.25 లక్షల జెడ్‌పి నిధులతో మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీ పనులు చేపట్టేందుకు కేటాయించినట్లు తెలిపారు. ఒక్కో గ్రామానికి రూ.5 లక్షలు చొప్పున ఐదు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు నిధులను సద్వినియోగం చేసుకొని త్వరితగతిన నిర్మాణ పనులు చేపట్టి మార్చిలోపు పనులు పూర్తి చేయాలన్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన సర్పంచులు మాట్లాడుతూ మంచినీటి చెరువులను నింపుకునేందుకు అధికారులు పంట కాలువలకు పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేయాలన్నారు. అరకొరగా విడుదల చేస్తున్న నీటి వల్ల మంచినీటి చెరువులను నింపుకునే అవకాశం లేదన్నారు. కాలువలకు పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేసి మంచినీటి చెరువులు నింపుకునేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి గంటా సంధ్య, నూతన ఎంపిడిఒ గంగాధర్, వైస్ ఎంపిపిలు చొప్ప సునీత, రాచూరి రాధ, అన్ని గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

## నేరాలు - ఘోరాలు

# వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - టి.నరసాపురం

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లుగా ఎస్ఐ విజయ కుమార్ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వెలగపల్లి పంచాయతీ, సాయంపాలెం గ్రామానికి చెందిన ఉడుముల దేవి భర్త కాలంగా షుగర్ వ్యాధితో బాధపడుతున్నాడు. గత నెల 29వ తేదీన ఏలూరు ఆసుపత్రికి మందుల కోసం వెళ్లి ఇప్పటి వరకు తిరిగి రాలేదు. భార్య సరస్వతి ఫిర్యాదుతో సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

# కెరీర్ గైడెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

## మానవత సంస్థ జిల్లా డైరెక్టర్ వెంకట ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - భీమడోలు

స్వచ్ఛంద సంస్థ మానవత ఆధ్వర్యాన పదవ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న కెరియర్ గైడెన్స్ తరగతులను సద్వినియోగపరుచుకోవాలని సంస్థ జిల్లా డైరెక్టర్ తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు కోరారు. ఆయన ఆధ్వర్యాన మండలంలోని మల్కీ మహమ్మద్ పురం, కురెళ్లగూడెం హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు కెరియర్ గైడెన్స్ తరగతులను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పదవ తరగతి విద్యార్థి దశలో

విద్యార్థులకు నగదు పురస్కారం అందజేస్తున్న ప్రతినిధులు

కీలకమని, ఉజ్వలమైన భవిష్యత్తు ప్రణాళిక తయారీకి మార్గదర్శకంగా నిలుస్తుందని తెలిపారు. అనంతరం సదరు పాఠశాలల్లో తెలుగు మాధ్యమంతో విద్యాపరంగా ప్రతిభ కనపరుస్తున్న ఇద్దరు విద్యార్థులకు సంస్థ తరపున ప్రథమ బహుమతిగా వెయ్యి రూపాయలు, ద్వితీయ బహుమతిగా రూ.500 నగదు అందజేశారు. దీంతో పాటు విద్యార్థులకు పదవ తరగతి స్టడీ మెటీరియల్, మానవత సంస్థ జారీచేసే సర్టిఫికెట్, మెమెంటోలను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మానవత భీమడోలు శాఖ ఛైర్మన్ గుళ్ల నూకరాజు, మాజీ అధ్యక్షులు పచ్చా వెంకటేశ్వరరావు, సదరు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.


తహశీల్దార్‌కు పుష్పగుచ్ఛం అదిస్తున్న ఎంపిపి

# పోలవరం తహశీల్దార్‌గా జివిఆర్ ప్రసాద్

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం తహశీల్దార్‌గా జివిఆర్ ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు తహశీల్దార్‌గా పనిచేసిన బత్తుల సుమతి కృష్ణా జిల్లాకు బదిలీ కాగా కాకినాడ తహశీల్దార్‌గా పనిచేస్తున్న ప్రసాద్ పోలవరం తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎంపిపి సంఘాల అధ్యక్షుడు, పోలవరం ఎంపిపి సుంకర వెంకట రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

## జీలుగుమిల్లి తహశీల్దార్‌గా ఆర్‌వి.వెంకటేశ్వరావు

**జీలుగుమిల్లి:** జీలుగుమిల్లి మండల తహశీల్దార్‌గా ఆర్‌వి.వెంకటేశ్వరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తూర్పుగోదావరి జిల్లా గొల్లప్రోలు తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ ఎన్నికల బదిలీల్లో భాగంగా జీలుగుమిల్లికి వచ్చినట్లు ఆయన తెలిపారు. ఇంతకుముందు ఇక్కడ పని చేసిన తహశీల్దార్ సుందర్ సింగ్ కృష్ణా జిల్లాకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఈయనను ఇక్కడ నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికల విధులను సక్రమంగా నిర్వహిస్తానన్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

## ఆగిరిపల్లి తహశీల్దార్‌గా మృత్యుంజయరావు

**ఆగిరిపల్లి:** ఆగిరిపల్లి మండల నూతన తహశీల్దార్‌గా బండి మృత్యుంజయరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. రావులపాలెం తహశీల్దార్‌గా పనిచేస్తున్న ఆయన సాధారణ ఎన్నికల బదిలీల్లో భాగంగా ఆగిరిపల్లి మండల తహశీల్దార్‌గా బదిలీపై వచ్చారు.

## బుట్టాయగూడెం తహశీల్దారుగా వెంకటేశ్వర్లు

**బుట్టాయగూడెం:** బుట్టాయగూడెం నూతన తహశీల్దారుగా వెంకటేశ్వర్లు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కృష్ణాజిల్లా జి.కొండూరు మండలంలో గతంలో పనిచేసిన ఈయన బదిలీపై బుట్టాయగూడెం వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్‌ఎస్.శాంతి కృష్ణాజిల్లా గూడూరు తహశీల్దార్‌గా బదిలీ అయ్యారు. మండలంలో అభివృద్ధికి కృషి చేస్తానని, రెవెన్యూ సమస్యలను గుర్తించి పరిష్కరించే విధంగా చర్యలు చేపడతానని తెలిపారు.

## టి.నరసాపురం తహశీల్దార్‌గా శుభాష్

**టి.నరసాపురం :** టి.నరసాపురం తహశీల్దార్‌గా టి.శుభాష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన తూర్పుగోదావరి జిల్లా పెదపూడి మండలంలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ తహశీల్దార్‌గా పనిచేసిన జెవి.సుబ్బారావు బదిలీపై కృష్ణాజిల్లా ఉంగుటూరుకు బదిలీ అయ్యారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

## చింతలపూడి తహశీల్దార్‌గా గోపాలకృష్ణ

**చింతలపూడి:** మండల నూతన తహశీల్దార్‌గా పి.గోపాలకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలో భాగంగా తూర్పుగోదావరి జిల్లా ప్రత్తిపాడు మండలం నుంచి చింతలపూడి మండలం తహశీల్దార్‌గా వచ్చినట్లు తెలిపారు.

ఛైర్మన్‌గా నియమితులైన లింగరావు

# త్రిసభ్య కమిటీ ఛైర్మన్‌గా వెంకట లింగరావు

ప్రజాశక్తి - ముసునూరు

చక్కపల్లి వ్యవసాయ ప్రాథమిక పరపతి సంఘం త్రిసభ్య కమిటీ ఛైర్మన్‌గా కాటేపల్లి వెంకట లింగరావు నియమితులైనట్లు వ్యవసాయ పరపతి సంఘం బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం మండలంలోని చక్కపల్లి గ్రామంలోని వ్యవసాయ పరపతి సంఘం త్రిసభ్య కమిటీ ఛైర్మన్ కోటగిరి రాజానాయన వైస్ ఎంపిపిగా కొనసాగడంతో, ఒకే వ్యక్తికి రెండు పదవులు వుండరాదని ప్రభుత్వం ఆదేశాల మేర నూతనంగా కాటేపల్లి వెంకట లింగరావు నియమింపబడ్డారు.


ఛైర్‌పర్సన్‌గా నియమితులైన నరశింహారావు

# సహకార పరపతి సంఘం ఛైర్‌పర్సన్‌గా నరసింహారావు

**ఆగిరిపల్లి :** ఆగిరిపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఛైర్‌పర్సన్‌గా వైసిపి ఆగిరిపల్లి మండలాధ్యక్షులు పల్లగాని నరశింహారావు(చిన్నాగిరిపల్లి) బాధ్యతలు చేపట్టారు. డైరెక్టర్స్‌గా చవటపల్లి అంజయ్య(ఆగిరిపల్లి), జ్యోతి దానకర్ణ(వట్టిగుడిపాడు) నియమితులైయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు సకాలంలో ఆగిరిపల్లి పిఎసిఎస్ సేవలు అందేలా చర్యలు చేపడతామన్నారు. అనంతరం ఈ అవకాశమిచ్చిన ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

# భీమడోలు తహశీల్దార్‌గా వరహాలయ్య

ప్రజాశక్తి - భీమడోలు

వీడ్కోలు, సత్కారం కార్యక్రమాలను నిర్వహిస్తున్న అధికారులు

భీమడోలు తహశీల్దార్‌గా జి.వరహాలయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వీరు తూర్పుగోదావరి జిల్లా కాకినాడ ఆర్‌డిఒ కార్యాలయంలో పరిపాలన అధికారిగా పనిచేస్తూ ఎన్నికల నేపథ్యంలో భీమడోలు వచ్చారు. ఇంతవరకు వీరి స్థానంలో పనిచేసిన ఎం.ఇందిరాగాంధీ ఏలూరు ఆర్‌డిఒ కార్యాలయం అధికారిగా బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన వరాహలయ్య మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో బదిలీపై భీమడోలు వచ్చిన తాను ఎన్నికల విధులతో పాటు, కార్యాలయ ఇతర బాధ్యతలను నిర్వహిస్తానన్నారు. ప్రజలకు, సిబ్బందికి అందుబాటులో ఉంటానన్నారు. 2014వ సంవత్సరంలో నిర్వహించిన ఎన్నికల సందర్భంగా ఒక పర్యాయం పశ్చిమగోదావరి జిల్లాలో పనిచేశానని, ఆరు సంవత్సరాల పాటు కృష్ణాజిల్లాలో పని చేశానని, మిగిలిన సర్వీసు అంతా తూర్పుగోదావరి జిల్లాలో పనిచేశానని తెలిపారు. కార్యాలయ అధికారులు, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ రెవెన్యూ సహాయకులు, గ్రామ సచివాలయాల సిబ్బంది నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వరాహాలయ్యకు స్వాగతం పలికారు. బదిలీయైన ఎం.ఇందిరాగాంధీకి సాదరంగా వీడ్కోలు పలికారు.

# త్రిసభ్య కమిటీ ఛైర్మన్‌గా సుబ్బరాజు

ప్రజాశక్తి - భీమడోలు

బాధ్యతలు స్వీకరిస్తున్న నంద్యాల సుబ్బరాజు

గుండుగొలను విశాల సహకార పరపతి సంఘం పాలకమండలి త్రిసభ్య కమిటీ ఛైర్మన్‌గా నంద్యాల సుబ్బరాజు తిరిగి మరోసారి నియమితులయ్యారు. సోమవారం ఛైర్మన్‌గా బాధ్యతలను స్వీకరించారు. ఇంతవరకు వీరి స్థానంలో ప్రత్యేక అధికారిగా పనిచేసిన ఎం.నరసింహరాజు బాధ్యతలను ఆయనకు అప్పగించారు. కోర్టు వివాదాలు కారణంగా ఆయన అప్పట్లో బాధ్యతల నుంచి తప్పుకున్నారు. తిరిగి తాజాగా కోర్టు ఆదేశాలతో మరొకమారు ఛైర్మన్‌గా సుబ్బరాజు బాధ్యతలను స్వీకరించారు. వీరితో పాటు ఛైర్‌పర్సన్లుగా ముద్రాపు నాగేంద్రబాబు, భలే విష్ణు నారాయణ కూడా బాధ్యతలను స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది, ఇతర ప్రముఖుల త్రిసభ్య కమిటీ సభ్యులను అభినందించారు.

# బటన్ నొక్కాడు సరే.. లబ్ధిదారుల ఖాతాల్లోకి డబ్బులేవి?

## రా కదలిరా సభలో మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

ప్రజాశక్తి - చింతలపూడి

రాష్ట్రంలో ప్రజల కోసం 122 సార్లు బటన్ నొక్కానని గొప్పలు చెప్పుకుంటున్న సిఎం జగన్ తర్వాత ఎంతమంది లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమవుతున్నాయో కూడా నిజం చెప్పాలని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు డిమాండ్ చేశారు. చింతలపూడి ఆంథోనినగర్‌లో సోమవారం నిర్వహించిన రా కదలి రా బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. జనవరి 23వ తేదీన ఆసరా 4వ విడత నిధులు విడుదల అంటూ బటన్ నొక్కినా ఇప్పటివరకు ఎందుకు లబ్ధిదారుల ఖాతాలో డబ్బులు పడలేదో సమాధానం చెప్పాలన్నారు. అనంతరం సోంగరోషన్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికలకు సిద్ధమంటున్న జగన్ ఊరూరా తిరుగుతూ చేయబోయేది అబద్ధాల యుద్ధమే అన్నారు. చంద్రబాబు కంటే ఎక్కువ సంక్షేమం చేశా అని చెప్పుకోవడానికే జగన్ ఇలాంటి మోసపూరిత చర్యలకు పాల్పడుతున్నారన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చాక వైసిపి ఇచ్చిన సంక్షేమాన్ని మించిన సంక్షేమ పథకాలు తెస్తామని, దీంతో పాటు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని అన్నారు. అనంతరం బిసి నాయకులు దాసరి శేషు మాట్లాడుతూ సూపర్-6 పథకాలలో భాగంగా యువతకు సంవత్సరానికి 4 లక్షల ఉద్యోగాలు ఇస్తామని తెలిపారు. మాజీ మంత్రి పీతల సుజాత మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా ముందుకు తీసుకెళ్తామన్నారు. మేం అధికారంలోకి వచ్చాక ఇంట్లో ఎంతమంది విద్యార్థులుంటే అంతమందికి సంవత్సరానికి తల్లికి వందనం ద్వారా రూ.15వేలు ఇస్తామని తెలియజేశారు.

# 'రా.. కదలిరా'కు తరలిన నేతలు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఆగిరిపల్లి మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున చింతలపూడిలో జరిగే రా కదలిరా సభకు భారీగా తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో నూజివీడు నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షుడు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆగిరిపల్లి మండల టిడిపి మాజీ మండల అధ్యక్షులు పల్లగాని గంగాధరరావు పాల్గొన్నారు.

**ముసునూరు:** టిడిపి అధినేత చంద్రబాబునాయుడు చింతలపూడిలో నిర్వహిస్తున్న రా కదిలిరా సభకు సోమవారం మండలంలోని 16 గ్రామాల ప్రజలు పెద్దఎత్తున హాజరైనట్లు టిడిపి మండల అధ్యక్షులు దేవినేని ఢలరామ్ అన్నారు. మండలంలోని రాష్ట్ర తెలుగుయువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దే రాఘుబాబు, కొల్లి గంగారామ్, మందలపు ధర్మరాజు, మేదరమెట్ల సురేంద్ర, సూర్యదేవర నాగమంజుల శ్రీనివాసరావు, గద్దల సుహాసని మెహనరావు, పాకనాటి సీతారామాంజనేయులు, గార్లపాటి నరిసింహారావు, నక్కా యోహాన్, మానురాజు సురేష్, లక్కపాము కాంతారావు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు.

**కలిదిండి :** ఏలూరు పార్లమెంట్ పరిధి చింతలపూడిలో జరిగే టిడిపి బహిరంగ సభకు మండల పరిధిలోని టిడిపి శ్రేణులు తరలి వెళ్లారు. కార్ల ర్యాలీకి టిడిపి మండలాధ్యక్షులు పోకల జోగిరాజు, ఎఎంసి మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస చౌదరి జెండా ఊపి ప్రారంభించారు. తొలుత మాజీ ఎంపీ మాగంటి బాబు పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్స్ పంచారు. టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మేడిశెట్టి సీతారామాంజనేయులు, సర్పంచి గూడవల్లి శ్రీనివాసరావు, నాయకులు ముద్దం భోగేశ్వరారావు, కొల్లాటి నాగరాజు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

**టి.నరసాపురం :** చింతలపూడిలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు నిర్వహించిన 'రా కదలి రా' బహిరంగ సభకు మండలంలోని టిడిపి శ్రేణులు సోమవారం భారీగా తరలి వెళ్లారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరగాలన్నా, రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలన్నా చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తోట లక్ష్మీనారాయణ, వాసిరెడ్డి మోహన్ రావు, జోనుబోయిన సోంబాబు, గండబోయిన శ్రీను, సందేపూడి సాయి పాల్గొన్నారు.

**కుక్కునూరు :** చింతలపూడిలో జరిగే రా కదలి రా సభకు కుక్కునూరు నుంచి టిడిపి అధ్యక్షుడు ములిశెట్టి నాగు ఆధ్వర్యంలో 50 టాటా మ్యాజిక్లు, 15 కార్లు, 5 మినీ వ్యాన్, ద్విచక్ర వాహనాలతో సుమారు 1000 మందికిపైగా ఆ సభకు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో జనసేన అధ్యక్షుడు ములిశెట్టి యుగంధర్, మంత్రి గోపాలకృష్ణ పాల్గొన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు : ఎస్ఐ

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఎస్ఐను కలిసిన సిబ్బంది

ఉన్నతాధికారుల ఆదేశాలతో శాంతిభద్రతలు కాపాడేందుకు పూర్తిస్థాయిలో చర్యలు చేపడతానని మూడో పట్టణ ఎస్ఐ ఫణీంద్ర తెలిపారు. ఏలూరు మూడో పట్టణ ఎస్ఐగా జి.ఫణీంద్ర సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. 2012 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన ఈయన ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా మొట్టమొదటి ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. అనంతరం కృష్ణా జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆయన ఎస్ఐగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం ఆయన గవర్నర్ పేట ఎస్ఐగా పనిచేస్తూ ఉండగా సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాలోని మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. సోమవారం ఆయన ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఉన్నతాధికారులు, ఏలూరు మూడో పట్టణ సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.

# వాటర్ ట్యాంక్‌లో గుర్తు తెలియని జంతు కళేబరం!

**పోలవరం :** పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు వినియోగించే వాటర్ ట్యాంకులో గుర్తించలేని విధంగా ఉన్న జంతు కళేబరం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 550 మంది విద్యార్థులు వున్నారు. వారు నిత్యం వినియోగించే వాటర్ ట్యాంకులో గత కొన్ని రోజుల క్రితం ప్రమాదవశాత్తూ ఒక జంతువు దూకి పైకి రాలేక మృతి చెందింది. ఈ జంతువు కుళ్లి శరీరంపై చర్మంపోయి కేవలం ఎముకలతో జంతు అస్థి పంజరంగా మిగిలింది. అంతలా పాడై దుర్వాసన వెదజల్లే వరకు ఈ మంచి నీటి ట్యాంక్‌ను పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు చూడలేదని స్పష్టం అవుతుంది. వాటర్ ట్యాంక్ పై మూత తీసిన సిబ్బంది నిర్లక్ష్యంగా పక్కకు వదిలివేయడమే కారణంగా తెలుస్తోంది. గత శుక్రవారం విద్యార్థులు నీటిని వినియోగించే క్రమంలో నీరు దుర్వాసన రావడంతో ఉపాధ్యాయులకు ఫిర్యాదు చేశారు. ఉపాధ్యాయులు వాటర్ ట్యాంకులో నీరు వాసన వస్తుందని శుభ్రం చేయాలని పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేయడంతో పంచాయతీ కార్యదర్శి ఆదివారం వాటర్ ట్యాంకును శుభ్రం చేయడానికి సిబ్బందిని పంపించారు. సిబ్బంది ట్యాంక్‌ని శుభ్రం చేసే క్రమంలో ట్యాంకులో కుళ్లిన జంతు కళేబరం ఉండడాన్ని గమనించారు. విద్యార్థులు వినియోగించే నీటి ట్యాంకులను శుభ్రం చేయించడంలో సంబంధిత సిబ్బంది, ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వహించడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బాధ్యతలు నిర్వహిస్తున్న రాజు

# నగర పంచాయతీ కమిషనర్‌గా రాజు

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి నగర పంచాయతీ కమిషనర్‌గా డిజెఎస్‌పి.రాజు ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. పలువురు ఆయన్ని కలిసి అభినందనలు తెలిపారు.


నియామక పత్రాన్ని అందుకుంటున్న కుటుంబరావు

# కాంగ్రెస్ ఎస్‌సి సెల్ ఛైర్మన్‌గా కుటుంబరావు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

కాంగ్రెస్ ఎస్‌సి సెల్ ఛైర్మన్‌గా చిడిపి కుటుంబరావును సోమవారం నియమించారు. బుట్టాయిగూడెం మండలం అచ్చియపాలెం గ్రామానికి చెందిన కుటుంబరావును ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్‌సి డిపార్ట్మెంట్ ఛైర్మన్ సాకే శంకర్ ఆమోదంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షులు జెట్టి గురునాధరావు సూచనల మేరకు నియమించడం జరిగింది.

# పిఎసిఎస్ ఛైర్మన్‌గా గిరి భోగరావు

ప్రజాశక్తి - చింతలపూడి

రాఘవపురం పిఎసిఎస్ సొసైటీని అభివృద్ధిలో పథంలో నడిపిస్తామని పిఎసిఎస్ ఛైర్మన్ గిరి భోగరావు అన్నారు. చింతలపూడి మండలం రాఘవపురంలో పిఎసిఎస్ వద్ద నూతన సొసైటీ ఛైర్మన్‌గా ఆయన పదవి చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు కావాల్సిన రుణాలు ఇచ్చి రికవరీ చేసి సొసైటీని అభివృద్ధి పథంలో తీసుకొస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎండపల్లి సర్పంచి మోహన్, పిఎసిఎస్ ఛైర్‌పర్సన్ పాల్గొన్నారు.

# సాంకేతిక విద్యపై ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పట్టణంలోని ఎస్‌ఆర్‌ఆర్ బాయ్స్ జెడ్‌పి హైస్కూల్ ఆవరణలో సోమవారం రసాయన, భౌతికశాస్త్ర ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ భాగవతుల హేమలత మాట్లాడుతూ డిజిటల్ తరగతులకు అనుగుణంగా విద్యార్థులను తయారు చేసే దిశగా ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లుగా తెలిపారు. నేటి పోటీ ప్రపంచంలో నిలబడేలా విద్యార్థులను తయారు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సబ్ జైలును సందర్శించిన జిల్లా అధికారులు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పట్టణంలోని సబ్ జైలును జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కెవి.రామకృష్ణయ్య సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదిని పెట్టుకునే స్తోమత లేని వారి వివరాలను తెలుసుకున్నామన్నారు. అలాగే బెయిల్ వచ్చి జామీను పెట్టలేక రిమాండ్‌లోనే ఉన్న ఖైదీల వివరాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.హరిబాబు, డిప్యూటీ జైలర్ గంగినేని ప్రసాద్, తదితర కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# కొయ్యలగూడెంలో ఆసరా చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కొయ్యలగూడెం మండల కేంద్రంలో ఎఎంసి యార్డ్ ప్రాంగణంలో సోమవారం వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమము నిర్వహించినట్లు వైఎస్ఆర్ క్రాంతి పథకం ఎపిఎం సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎంఎల్ఎ తెల్లం బాలరాజు ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు ఆసరా చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. 4వ విడత వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమంలో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు ఇప్పటికే సమాచారం అందించామని తెలియజేశారు.

KANAKADURGA FINAN CE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్: -1st ఫ్లోర్, జెడ్‌ల్యాబ్స్ ఎదురు, ఆర్‌ఆర్‌పేట, ఏలూరు.
- ఏలూరురోడ్డు, లక్ష్మిథియేటర్ ఎదురు, జంగారెడ్డి గూడెం.
-1st ఫ్లోర్, సుబ్బారావుపేట, కమల హాస్పిటల్స్ ఎదురు, తాడేపల్లిగూడెం
-1st ఫ్లోర్, వెంకన్నప్లాజా, కప్పల వెంకన్న సెంటర్, వేల్పూరు రోడ్డు, తణుకు.
-1st ఫ్లోర్, కన్నపురం రోడ్డు, వాసవి కన్యకా పరమేశ్వరి గుడి పక్కన, కొయ్యలగూడెం.
-1st ఫ్లోర్, బస్టాండ్ ఎదురు, దేవరపల్లి
- గ్రౌండ్‌ఫ్లోర్, అక్షరానంద స్కూల్ ఎదురు, ధర్మాజీగూడెం-534462, ఏలూరు జిల్లా.
- 16-225, ఫస్ట్‌ఫ్లోర్, పాతబస్టాండ్ దగ్గర, జివిమాల్ సూపర్ మార్కెట్, మెయిన్‌రోడ్డు, చింతలపూడి. ఫోన్ :9492934845
బంగారు వేలం ప్రకటన
ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 24-02-2024 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 2600.0 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు హెడ్డాఫీసు : డోర్ నెం.54-9-23, 100 అడుగుల రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7 నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించు కోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిస్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంటే తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.
ఆథరైజ్డ్ ఆఫీసర్
కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్
H.O. : 100 అ॥ రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7.
ELURU AREA CELL NO- 80088 12798